## క్లుప్తంగా

### గోకులంలో గాయత్రీ జపం



గాయత్రీ జపం యజ్ఞంలో పాల్గొన్న పండితులు

**బోట్‌క్లబ్:** కేసిదాస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, సంధ్యావందన అభ్యాసన శిక్షణ సమితి ఆధ్వర్యంలో కొలను శ్రీరామచంద్రమూర్తి, జయలక్ష్మి సౌజన్యంతో స్థానిక గోకులంలో ఆదివారం గాయత్రీ జపం నిర్వహించారు. పలువురు వేద పండితులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వెయ్యి గాయత్రి జప మంత్ర యజ్ఞం నిర్వహించారు. పోతాప్రగడ వీరవెంకట సత్యనారాయణస్వామి, తురగా సూర్యారావు, వెంపరాల నాగసుబ్రహ్మణ్యం, నిడసనభట్ల నాగ సుబ్రహ్మణ్యం, మండలిక శ్రీరామచంద్రమూర్తి, ఈమని రాజశేఖర్, కలగ పాపయ్య శర్మ, వాజపేయాజుల మణికంఠ, దర్భా భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఈ గాయత్రి జప యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

### విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌కు చెందిన మెరిట్ విద్యార్థి ఎస్.దిలీప్‌కు బీటెక్ ఉన్నత చదువు నిమిత్తం ల్యాప్‌టాప్‌ను ఉపాధ్యాయుడు శ్రీనివాస్ బహూకరించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించి బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థి దిలీప్‌కు ల్యాప్‌టాప్‌ను ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, అద్దాల సత్యనారాయణ, జి.కృష్ణమోహన్, కేఎస్ శర్మ, బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న ఐదుగురి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్సై

**కరప:** పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,240 నగదు, 104 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ గ్రామ శివారున పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో కరప ఎస్సై టి.సునీత సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుకున్నారు. వారిని సోమవారం కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

### తంటికొండ దేవస్థానం నూతన కమిటీ ప్రకటన

**గోకవరం:** మండలంలోని తంటికొండలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం ప్రకటించారు. 11 మంది సభ్యులతో కూడిన కమిటీని కులాలు, ప్రాంతాల వారీగా సమతుల్యంగా నియమించినట్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్‌గా బద్దిరెడ్డి అచ్చన్నదొరతోపాటు, సభ్యులుగా సుంకర వీరమణి, ఏగి దుర్గాదేవి, నాగులపాటి అరుణకుమారి, చింతల నాగేశ్వరరావు, బొట్టా రామకృష్ణ, పసుమర్తి సత్యకళ, సప్పిడి పెంటరాజు, మల్ల అమ్మాజీ, వల్లూరి ప్రసాద్, మడకం పద్మ, ఎక్స్ అఫీషియల్ నంబర్‌గా దేవస్థాన పురోహితుడు పెద్దింటి దత్తును నియమించామన్నారు. కమిటీకి సంబంధించిన గెజిట్ త్వరలో వస్తుందన్నారు.

### హిట్ అండ్ రన్ చట్టం రద్దు చేయాలి

**కోటనందూరు:** హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ పద్మ డిమాండ్ చేశారు. స్థానిక నూకాలమ్మ గుడి ఆవరణలో రవాణా కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పద్మ మాట్లాడుతూ, ట్రాన్స్‌పోర్ట్ రంగానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు బస్సుల్లో కూడా క్లీనర్లను ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆరుగురు జూదరుల అరెస్టు

**రౌతులపూడి:** మండలంలోని దిగువశివాడ గ్రామ శివారు తాండవ కాలువ గట్టుపై పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసివారి వద్ద నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వేంకటేశ్వరరావు తెలిపారు. తాండవ కాలువ గట్టుపై పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం సాయంత్రం దాడి చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు.

# వెదజల్లు సాగు.. లాభాలు బాగు..

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- సాగు నీరు, విత్తనాలు ఆదా
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి

**కాకినాడ సిటీ:** ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులు సాగు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చు. వెదజల్లె పద్ధతిలో వరి వేస్తే నాట్లు తగ్గి రైతుకు లబ్ధి చేకూరుతుంది. ఇప్పుడిప్పుడే రైతుల్లో అవగాహన పెరిగి చిన్న, సన్నకారు రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ పద్ధతిపై మండల, డివిజన్ వ్యవసాయ అధికారులతో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ విజయకుమార్ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రైతులు వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్నారు. కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో 20వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



వెదజల్లు సాగు పద్ధతిలో సాగు చేసిన వరి చల్లిన చేలు

**వెదజల్లు పద్ధతిలో సాగు ఇలా**

- వరిని నాటు వేసే పద్ధతి కాకుండా పొలంలో విత్తనాలు చల్లే పద్ధతే వెదజల్లు సాగు.
- సాధారణంగా రైతులు వరి సాగు కోసం నారు మళ్లు ఏర్పాటు చేస్తారు. ఈ పద్ధతిలో వరి విత్తనం ఎక్కువ అవసరం అవుతుంది.
- సాగు నీరు, కూలీల ఖర్చు ఎక్కువగా ఉంటుంది.
- నారు పెరిగిన తర్వాత నాట్ల కోసం కూలీల ఖర్చు పెరుగుతుంది. ఈ పద్ధతిలో వరి ఆలస్యంగా కోతకు వస్తుంది.
- వెదజల్లు పద్ధతిలో అయితే మడులను సమాంతంగా చదును చేసుకొని కొద్దిపాటి నీరు ఉంచి విత్తనాన్ని చల్లుతారు.
- ఈ పద్ధతి ద్వారా ఎకరాకు 10 నుంచి 15 కిలోల వరకు విత్తనం ఆదా అవుతుంది.
- ఈ పద్ధతిలో వరి సాగు చేస్తే 15 రోజుల ముందుగానే కోతకు వస్తుంది. దిగుబడి ఎకరాకు 10 నుంచి 15 శాతం అధికంగా వస్తుంది.

**ఈ నేలలు అనుకూలం**

- ఈ వెదజల్లె పద్ధతికి చౌడు, ముంపునకు గురయ్యే నేలలు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయి.
- కాకినాడ రూరల్, సిటీ పరిధిలో నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. కాబట్టి ఈ సాగు పద్ధతి ఇక్కడ అనుకూలంగా ఉంటుంది.

**పొలం తయారీ ఇలా**

- పొలంలో ఎత్తు పల్లాలు లేకుండా సమాంతంగా ఉండేలా దమ్ము చేసుకోవాలి.
- విత్తనం చల్లిన తర్వాత నీరు ఎక్కువగా నిల్వ ఉండకూడదు. నీరు బయటకు పోయే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

**విత్తనాల ఎంపిక**

- ఈ వెదజల్లె పద్ధతిలో వరి సాగు కోసం విత్తనాల ఎంపిక ముఖ్యమైంది. అందుకోసం కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ దృఢంగా ఉండి పడిపోని రకాలను ఎంపిక చేసుకోవాలి.

**విత్తన మోతాదు**

- ఒక ఎకరాకు 10 నుంచి 15 కిలోల విత్తనాలు సరిపోతాయి.
- ముందుగా విత్తనాలను ఒక గోనె సంచిలో వేసి 24 గంటలు నానబెట్టాలి.
- నానిన విత్తనాలను మరో 24 గంటలు నీడలో మండె కట్టాలి.
- ముక్కు, పగిలిన విత్తనాలను మాత్రమే దమ్ము చేసిన పొలంలో సమానంగా ఒక తాడు సహాయంతో చల్లుకోవాలి.

**నీటి యాజమాన్యం**

- విత్తిన నాటి నుంచి వారం పది రోజుల వరకు ఎక్కువగా నీటిని నిల్వ ఉంచరాదు.
- నీరు నిల్వ ఉంటే మొలక శాతం తగ్గుతుంది. ఆ తర్వాత పిలకలు తొడిగే దశ వరకు నీరు పలుచగా పెట్టాలి.
- వరి పొట్ట దశలో ఉన్నప్పుడు సాధారణంగా నాట్లు వేసిన పొలం మాదిరిగానే నీటి యాజమాన్యం పాటించాలి.

**కలుపు యాజమాన్యం**

- వెదజల్లె పద్ధతిలో కలుపు యాజమాన్యం చాలా కీలకం. సాధారణ సాగుతో పోల్చితే ఈ పద్ధతిలో కలుపు అధికంగా ఉంటుంది.
- రైతులు విత్తనాలు వేసిన వెంటనే ఫెర్టిలాక్లోర్‌ను ఎకరాకు 800 మిల్లీ లీటర్లను పిచికారీ చేయాలి.
- 8 నుంచి 10 రోజుల తర్వాత ఆక్సోడైజల్ 40 గ్రాముల ఎకరాకు వేయాలి. 15 రోజుల తర్వాత ఊద, ఒడిపిలిని గమనిస్తే ఎకరాకు ఫినాక్సిప్రోప్-ఇథైల్ 300 మిల్లీ లీటరును నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- 20 రోజుల తర్వాత వెడల్పాటి, గడ్డి జాతి కలుపును గమనిస్తే ఫినాక్సిలామ్‌ను పిచికారీ చేయాలి.

**లాభాలు ఇలా..**

- కూలీల కొరతను అధిగమించి పెట్టుబడిని తగ్గించవచ్చు.
- ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదా అవుతుంది.
- విత్తన మోతాదు ఎకరాకు 10 నుంచి 15 కిలోల వరకు ఆదా అవుతుంది.
- ఈ పద్ధతిలో నారు పెంపకం లేనందున 10 నుంచి 15 రోజుల సమయం ఆదా అవుతుంది.
- విత్తనం నేరుగా చల్లడం వల్ల పిలకల సంఖ్య పెరిగి ఎకరాకు 10 నుంచి 15 శాతం దిగుబడి అధికంగా వస్తుంది.

# ఇంకెన్నాళ్లీ నరకయాతన?



బురదమయంగా మారిన స్థానిక విద్యుత్ నగర్-ముత్తా వారధికి వెళ్లే రహదారి

**బోట్‌క్లబ్:** చినుకు పడితే ఆ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ముత్తా వారధి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడంతో రాకపోకలు సాగిస్తున్నారు. వీటికి అనుసంధానంగా ఉన్న పలు రహదారుల నిర్మాణంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా చేసింది. దీంతో ప్రతిరోజు ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. స్థానిక విద్యుత్ నగర్ నుంచి ముత్తా వారధికి వెళ్లే రహదారి అసంపూర్తిగా ఉండడంతో చిన్న చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. దీంతో నిత్యం ఈ రహదారిపై వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు ప్రతి నిత్యం ఈ రహదారిపై సాహసం చేసి ప్రయాణం సాగిస్తున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ రహదారి చాలా అధ్వానంగా తయారైంది. ద్విచక్రవాహనాలు సైతం జారిపడిపోతున్నారు. వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించిన ఈ రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ఎస్ఎఫ్ఐ కాకినాడ నగర కమిటీ ఎన్నిక



ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**కాకినాడ సిటీ:** ఎస్ఎఫ్ఐ కాకినాడ నగర నూతన కమిటీని ఆదివారం కాకినాడ పీఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు సంజయ్ స్వతంత్రం-ప్రజాస్వామ్యం-సోషలిజం నినాదాలు గల ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి, ప్లీనరీ సమావేశాలను ప్రారంభించారు. ఈ ప్లీనరీ సమావేశంలో కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, అధ్యాపకులు వర్మ, భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఎస్ఎఫ్ఐ వంటి సంఘాల్లో చురుగ్గా పాల్గొనాలని భయాన్ని వదిలి ధైర్యంగా ప్రశ్నించాలన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఎన్ఈపీ 2020ని తక్షణమే రద్దు చేయాలని, ఎయిడెడ్ పాఠశాల, కళాశాలల్లో పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలలో పాఠశాలలను గుర్తించాలని తక్షణమే వారికి పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటి కోసం కాకినాడలో ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాకినాడ నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వాసుదేవ్, సాహిత్ ఎన్నికయ్యారు. నగర ఉపాధ్యక్షులుగా అమృత, రాజేష్, గమనవేలు, కరుణ్, సహాయ కార్యదర్శులుగా సత్యం, తేజ, అక్షిత, భువనేశ్వరి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దాపురం ప్రతిష్టను దిగజారిస్తే సంహించం

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తుల ధర్నా



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న నరేష్ పెద్దిరెడ్డి

**పెద్దాపురం:** తప్పుడు ప్రచారాలతో పెద్దాపురం ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నిస్తే సహించేది లేదంటూ పట్టణ పుర ప్రజలు ఫర్‌పెక్ట్ పెద్దాపురం పేరుతో ఆదివారం రోడ్డెక్కారు. మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం, కూటమి నేతలు, ప్రజా సంఘాల పిలుపులో భాగంగా వందల సంఖ్యలో ప్రజలు స్థానిక దర్గాసెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కల్గిన పెద్దాపురం పట్టణం పరువును దిగజార్చే ప్రయత్నం ఎవరూ చేసినా సహించేది లేదన్నారు. పట్టణం గురించి తప్పుగా వీడియో విడుదల చేసిన యూట్యూబర్ తులసి, దానిపై ఇన్వెస్టిగేషన్ జరిపిన జర్నలిస్టుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు కథనాలు, సమాచారం అందించిన వారిని చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మౌనికకు వినతి పత్రం అందజేశారు. తొలుత పర్‌ఫెక్ట్ పెద్దాపురం సంతకాల సేకరణ నిర్వహించారు.

### గొల్లప్రోలులో చోరీ

**పిఠాపురం:** గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న గుడివాడ లోవకుమారి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం... బాధితురాలు గుడివాడ లోవకుమారి తన ఇంట్లో శనివారం రాత్రి 19 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించారు. తెల్లవారుజామున కాలకృత్యాల కోసం లేచి చూడగా తమ పడక గదిలో అల్మారా తెరచి ఉండడం చూసి ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. అల్మారాలో పెట్టిన సుమారు రూ.65 వేల విలువైన బంగారు వస్తువులు కొంత నగదు చోరీకి గురయినట్లు తెలుసుకుని ఆదివారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంచాలి



రోటరీక్లబ్‌గీత స్కూల్ ఇంటరాక్షన్ క్లబ్ ఇనస్టలేషన్ నిర్వహించిన దృశ్యం

**బాలాజీచెరువు:** విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చాలని జేఎన్‌టీయూకే మాజీ వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక చల్లా ఫంక్షన్‌హాల్లో ఆదివారం రోటరీక్లబ్ గీతం స్కూల్ ఇంటరాక్షన్ క్లబ్ ఇనస్టలేషన్ నిర్వహించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సురభిశారద అధ్యక్షత వహించగా రోటరీగవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి, ఆండాళ్ జయలక్ష్మిలు ముఖ్య అతిధులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో క్లబ్‌లు ఏర్పాటుమ చేసి వారితో చిన్నచిన్న సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం ప్రారంభిస్తే వారిలో ముందుగా ఐక్యతతో పాటు సమాజ సేవపై అవగాహన కలుగుతుందన్నారు.అనంతరం ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకరణ చేయించి వారికి పిన్‌లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ కరస్పాండెంట్ సుజ్ఞాన్, రోటరీక్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ తాడాల బుజ్జి, పాస్ట్ ప్రెసిడెంట్ తాడాల వరప్రసాద్, గోపుకాశీవిశ్వనాథ్, బాబీ పాల్గొన్నారు.

## తల, మెడ క్యాన్సర్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వైద్యుడు అద్దాల

**కాకినాడ రూరల్:** తల, మెడ క్యాన్సర్లపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని వైద్యులు అద్దాల సత్యనారాయణ, శివకుమార్ పేర్కొన్నారు. ప్రపంచ తల, మెడ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని బోట్‌క్లబ్ గ్రంథాలయంలో ఆదివారం కాకినాడ ఐడీఏ, అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్ అనేది కణాల పెరుగుదలతో ప్రారంభమవుతుందన్నారు. ఆరోగ్యకరమైన శరీర కణజాలంపై దాడి చేసి నాశనం చేస్తాయన్నారు. తల, మెడ క్యాన్సర్ అనేది తరచూ నోరు, గొంతు, సైనసెస్, లాలాజల గ్రంథుల్లో ప్రారంభమయ్యే క్యాన్సర్లను సూచిస్తుందన్నారు. మెడలో ఒక గడ్డలా ఉండడం, నోటిలో నయం కాని పుండు, గద్గద స్వరం, ముఖం, మెడ లేదా పెదవుల చర్మంపై నయం కాని పుండు, చెవి నొప్పి, నోటిలో తెలుపు, ఎర్రని మచ్చలు, ప్రయత్నించకుండానే బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలన్నారు.

## సామాజిక కార్యకర్తను సత్కరించిన ఏఎస్పీ



సామాజిక కార్యకర్త అంజనేయులురెడ్డిని సత్కరిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు

**కాకినాడ రూరల్:** సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయులురెడ్డిని జిల్లా అడిషనల్ ఎస్పీ మొగలి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆదివారం సత్కరించారు. మిత్ర బృందం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం కాకినాడలోని ఒక ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాకినాడ- పిఠాపురం రోడ్డులో ఏడాది పొడవునా చలివేంద్రం నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలకు ప్లాస్టిక్ సామగ్రి విక్రయాల ద్వారా వచ్చే సొమ్మును ఖర్చు చేసే ఆంజనేయులు రెడ్డి నంది అవార్డుతో పాటు సేవారత్న, ఆంధ్రాశ్రీ పురస్కారాలు, పలు అవార్డులు అందుకున్నారు. మిత్ర బృందం సభ్యులు తమ ద్వితీయ వార్షికోత్సవంలో ఆయనను సత్కరించిన సేవలను కొనియాడారు. సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సేవా రంగంలో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో మిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకూ అండగా ఆర్యవైశ్యులు



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నేతలు

**పిఠాపురం:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఆర్యవైశ్యులు ఉంటారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పిఠాపురం ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కాకినాడ జిల్లా పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల ఆర్యవైశ్య సంఘాల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని వర్గాల వారికి అండగా ఉంటూ ఎన్నో సేవ సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు.

ఆర్యవైశ్య మహాసభ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్మినిస్ట్రేటివ్ వెలగా వెంకట నాగేష్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పిఠాపురం మండలం, యు కొత్తపల్లి మండలం, గొల్లప్రోలు మండలం నూతన కార్యవర్గ సభ్యులతో కాకినాడ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పులవర్తి కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. పిఠాపురం మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రేపాక రమేష్, కార్యదర్శిగా కంభంపాటి శ్రీరామ్, కోశాధికారిగా కంచర్ల నగేష్, ఉపాధ్యక్షుడిగా కొల్లేపల్లి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా చిత్తులూరి రాజా, అదనపు కోశాధికారి కొత్త శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు.

యు కొత్తపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కూరగాయల వీఆర్ ఎం.కృష్ణ, కార్యదర్శిగా సుతాపల్లి సతీష్, కోశాధికారిగా కడిమిశెట్టి వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా నేతి సత్యనారాయణ, అదనపు కార్యదర్శిగా చెన్నా శశిధర్, అదనపు కోశాధికారిగా కె.వి త్రిమూర్తులు, గొల్లప్రోలు మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ములుకూరి వెంకట్రాజు, కార్యదర్శి కేదార శెట్టి లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా వెత్స వీర వెంకట రమణమూర్తి, ఉపాధ్యక్షుడిగా గ్రంధి నాగ కృష్ణారావు, అదనపు కార్యదర్శిగా దర్శిపూడి శ్రీధర్, అదనపు కోశాధికారిగా కేదార్‌శెట్టి శ్రీధర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, సలహాదారులుగా మరి కొంతమందితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని వాసవీ మాత కండువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గ్రంధి నారాయణరావు బాబ్జి, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు పేరూరు గాంధీ, ఆర్యవైశ్య మహాసభ జాయింట్ సెక్రెటరీ పెనుగొండ కామరాజు, తూర్పుగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు భక్తుల సత్తిబాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు వాకచర్ల వీర వెంకట సత్యనారాయణ మూర్తి, కాకినాడ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు నార్ల రత్నాజీ, జోన్ చైర్మన్ ఇమ్మడి శెట్టి నాగేంద్ర కుమార్, లలిత ఇండస్ట్రీ అధినేత కాకినాడ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మట్టే శ్రీనివాస్, గ్రంధి రాజేష్, పిఠాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు దంగేటి సత్యనారాయణమూర్తి, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, బోడ సతీష్, కర్నాటకపు శేషారావు, కుసుమంచి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### సంగీతంలో ఉచిత శిక్షణ

**బోట్‌క్లబ్:** స్థానిక లక్కరాజు శేషకుమారి స్మారక సంగీత శిక్షణా కేంద్రంలో ఈ నెల 31వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సంగీత విద్యార్థులకు అన్నమయ్య, రామదాసు కీర్తనలు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఏ గ్రేడు ఆర్టిస్ట్ కె.శేషులత ఆధ్వర్యంలో సంగీత విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సంగీత విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### అబ్దుల్ కలాంకు నివాళి

**కాకినాడ రూరల్:** దేశ 11వ రాష్ట్రపతిగా సేవలందించిన క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన చిత్ర పటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణరాజు, అడబాల రత్నప్రసాద్, అద్దాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సంగిశెట్టి సేవలు చిరస్మరణీయం



సంగిశెట్టి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు అభిమానులు

**పిఠాపురం:** మాజీ ఎమ్మెల్యే సంగిశెట్టి వీరభద్రరావు రాజకీయంగా, సామాజికంగా ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నేతలు అన్నారు. పిఠాపురం మాజీ సమితి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సంగిశెట్టి వీరభద్రరావు 20వ వర్ధంతి కార్యక్రమం స్థానిక సర్పంచ్ చెక్కా శ్రీలలిత చినబాబు అధ్యక్షతన ఆయన స్వగ్రామం బి.కొత్తూరు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు సంగిశెట్టి విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగిశెట్టి వెంకటేశ్వరరావు, వీరభద్రరావు కుమార్తె తోట జానకి, గొల్లప్రోలు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అరిగెల రామయ్య దొర, కొత్తపల్లి బుజ్జి, జవ్వాది మాజీ జెడ్పీటీసీ సభ్యులు కృష్ణ మాధవరావు, మాజీ ఎంపీపీ సకుమల్ల నాగబాబు, ఏలేరు ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్డెం భాస్కరరావు, కూరాకుల చిట్టిబాబు, కూరాకుల శ్రీనివాస్, లోకారెడ్డి రామకృష్ణ బొలిశెట్టి రామజోగి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

**కొత్తపల్లి:** మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో ఆదివారం వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వలన అదుపుతప్పి ప్రమాదాలు జరిగి తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల కారణంగా ఎందరో జీవితాలు తారుమారు అయిపోతున్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు వద్ద మద్యం, ధూమపానం, గుట్కా వంటివి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### శ్రీనుకు ఆర్థిక సాయం

**కొత్తపల్లి:** ఉప్పాడకు చెందిన రాసపల్లి శ్రీను లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. శ్రీనుకు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సభ్యులు దాతల సహాయంతో ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సహాయం, 25 కేజీల రైస్, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు శేషారెడ్డి, అధ్యక్షుడు జీఎస్ఎన్, సభ్యులు నాగబాబు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### మాండవ్య నారాయణస్వామి ఆలయంలో రేపు ప్రత్యేక పూజలు

**సామర్లకోట:** స్థానిక అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు పద్మనాభాచార్యులు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం అమ్మవారి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు జరుగుతాయని తెలిపారు. అనంతరం సామూహిక పూజా కార్యక్రమం, పారాయణ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సం నిర్వహిస్తామని తెలిపారు.